**తేదీ - 22-09-2018**

-

# పత్రికా ప్రకటన

-

**ఏప్రిల్-మే నాటికి..**

**వరంగల్ కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్కు సిద్ధం..**

**-మరో వారం రోజుల్లో ఆన్‌లైన్‌లో ప్లాట్ల కేటాయింపు ప్రక్రియ ప్రారంభం**

**-తొలిదశలో రూ.1075 కోట్ల వ్యయంతో 1190 ఎకరాలలో ఏర్పాటు**

**-సూరత్, షోలాపూర్, భీమండి, ఇచ్చెర్ కరెంజీ వస్త్ర పరిశ్రమ యజమానులకు ఇక్కడే స్థలాలు కేటాయిస్తాం**

**- ప్రభుత్వ ప్రోత్సాహకాలు, సబ్సిడీలను సద్వినియోగం చేసుకొని స్వరాష్ట్ర పారిశ్రామికాభివృద్ధిలో భాగస్వామ్యం కండి**

**-టీఎస్-ఐఐసీ ఛైర్మన్ గ్యాదరి బాలమల్లు సూచన**

**- పరిశ్రమ భవన్‌లో మహారాష్ట్ర, గుజరాత్‌లో స్థిరపడ్డ తెలంగాణ వస్త్ర పరిశ్రమ యజమానులతో సమావేశం**

(హైదరాబాద్ - సెప్టెంబర్ 22)

దేశంలో అతి పెద్ద వస్త్రనగరిగా రూపుదిద్దుకుంటున్న వరంగల్ కాకతీయ మెగా **టెక్స్ టైల్** పార్కు ఐదారు నెలల్లో ప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తున్నట్లు రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ(టీఎస్-ఐఐసీ) ఛైర్మన్ గ్యాదరి బాలమల్లు తెలిపారు. తొలిదశలో రూ.1075 కోట్ల వ్యయంతో 1190 ఎకరాలలో ఏర్పాటు చేస్తున్న ఈ మెగా **టెక్స్ టైల్** పార్కుకు లే-అవుట్ సిద్ధమైందని, మరో

వారం రోజుల్లో ఆన్‌లైన్లో ప్లాట్లవిక్రయ ప్రక్రియ మొదలవుతుందని చెప్పారు. తెలంగాణ నుంచి ఇతర రాష్ట్రాలకు ఉపాధికై వలసవెళ్లి అక్కడ వస్త్ర పరిశ్రమలను నెలకొల్పిసొంత రాష్ట్రంలో యూనిట్ల ఏర్పాటుకుముందుకువస్తున్నపారిశ్రామికవేత్తలకు సైతం వరంగల్ కాకతీయ మెగా **టెక్స్ టైల్** పార్కులోనే అవకాశం కల్పించి , ప్రభుత్వం ద్వారా అందే అన్నిరకాల ప్రోత్సాహకాలను, రాయితీలు అందేలా చూస్తామని బాలమల్లు హామీ ఇచ్చారు. శనివారం బషీర్‌బాగ్ పరిశ్రమ భవన్‌లో షోలాపూర్, సూరత్, భీమండి, ఇచ్చేర్‌కరెంజీలో స్థిరపడ్డ తెలంగాణ వస్త్ర పరిశ్రమల యజమానులతో టీఎస్-ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు, ఎండీ నర్సింహారెడ్డి సమావేశమయ్యారు. సమావేశంలో వరంగల్ మడికొండ **టెక్స్ టైల్** పార్కు పరిశ్రమ యజమానుల సంఘం అధ్యక్షుడు డీ స్వామి, షోలాపూర్, సూరత్, భీమండి, ఇచ్చేర్ కరెంజీ వస్త్ర పరిశ్రమ యజమానుల సంఘం ప్రతినిధులు రాజేశం, మనోహర్, విజయ్, జీ శ్రీనివాస్, శ్రీనివాస్ కస్పా, నీలి ఆనంద్, ముల్లా, ప్రకాష్ తో పాటు 100 మంది సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా షోలాపూర్ పరిశ్రమల యజమానులు టర్కీ టవల్స్, చద్దర్లు, జమ్‌ఖానలు, సూరత్ పరిశ్రమల యజమానులు చీరలను, భీమండి, ఇచ్చేర్‌కరెంజీ పరిశ్రమల యజమానులు షూటింగ్, షర్టింగ్ వస్త్రాలను తయారు చేయడంలో మంచి గుర్తింపు పొందారని స్వామి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న **టెక్స్ టైల్** పాలసీ ఎంతో బాగుందని, తమకు భూమితో పాటు రాయితీలు అందిస్తే స్వరాష్ట్రంలో వస్త్ర పరిశ్రమలను ఏర్పాటు చేసుకొని పారిశ్రామికాభివృద్ధిలో భాగస్వామ్యం అవుతామని షోలాపూర్, సూరత్, భీమండి, ఇచ్చేర్‌కరెంజీ వస్త్ర పరిశ్రమల యజమానులు టీఎస్-ఐఐసీ చైర్మన్, ఎండీలను

కోరారు.  ఒక్కొక్కరికీ వెయ్యిమీటర్ల స్థలం కేటాయిస్తే రూ.1.80 కోట్ల పెట్టుబడితో చిన్న,మధ్యతరహా యూనిట్ ను ప్రారంభించేందుకు వెయ్యి మంది వస్త్ర పరిశ్రమ యజమానులం సిద్ధంగా ఉన్నామని, ఒక్కో యూనిట్ ద్వారా వెయ్యి మందికి ప్రత్యక్ష్యంగా, పరోక్షంగా ఉపాధి అవకాశం లభిస్తుందని వారు పేర్కొన్నారు.  వీరి అభ్యర్థనపై టీఎస్-ఐఐసీ ఛైర్మన్ బాలమల్లు సానుకూలంగా స్పందించారు. వరంగల్ కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో స్థలాలను కేటాయిస్తామని హామీ ఇచ్చారు. మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు..భారీ వస్త్ర పరిశ్రమలకే కాకుండా చిన్న,మధ్యతరహా వస్త్ర పరిశ్రమల యూనిట్ల(ఎంఎస్ ఎంఈ) ఏర్పాటుకు ముందుకువచ్చే పారిశ్రామికవేత్తలకు సైతం వరంగల్ కాకతీయ మెగా **టెక్స్ టైల్** పార్కులోనే స్థలాలను కేటాయించి, ప్రభుత్వం ద్వారా అన్నిరకాల ప్రోత్సాహకాలు, రాయితీలు అందేలా చూస్తామన్నారు. మరోవారం రోజుల్లో కాకతీయ మెగా **టెక్స్ టైల్** పార్కుకు సంబంధించిన ఆన్‌లైన్ ప్లాట్ల కేటాయింపు ప్రక్రియ ప్రారంభిస్తున్నామని, దరఖాస్తు చేసుకొని నిర్దేశిత భూమి ధరను చెల్లించి ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ప్లాట్ల రిజిస్ట్రేషన్ సమయంలో భూమి రేటులో కేవలం 10 శాతం నగదును చెల్లించి మిగతా మొత్తాన్ని వాయిదాల్లో చెల్లించే వెసులుబాటు ఉంటుందన్నారు. ప్లాట్ల కొనుగోలు చేసి నిర్ణీత గడువులోగా యూనిట్లను నెలకొల్పిన పారిశ్రామికవేత్తలకు భూమి ధరలో 50 శాతం రాయితీ, కాపిటల్ సబ్సిడీ కింద 25 శాతం, యంత్రాలపై 25 శాతం, విద్యుత్‌పై యూనిట్‌కు రూపాయి రాయితీలను ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని షోలాపూర్, సూరత్, భీమండి, సూరత్, షోలాపూర్,

భీమండి, ఇచ్చేర్‌కరెంజీ వస్త్ర పరిశ్రమల యజమానులకు టీఎస్-ఐఐసీ ఛైర్మన్ బాలమల్లు సూచించారు.

<u>**టెక్స్ టైల్ హబ్‌గా వరంగల్**</u>

వస్త్ర పరిశ్రమాభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం దేశంలోనే అత్యుత్తమ పాలసీని రూపొందించిందని టీఎస్-ఐఐసీ ఛైర్మన్ బాలమల్లు తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచనలు, పరిశ్రమలశాఖ మంత్రి కేటీఆర్ ప్రణాళికల ఫలితంగా మహారాష్ట్ర, గుజరాత్, తమిళనాడు రాష్ట్రాలకే పరిమితమైన వస్త్ర పరిశ్రమలు నేడు తెలంగాణకు పెద్ద ఎత్తున తరలివస్తున్నాయని వెల్లడించారు. వరంగల్ కేంద్రంగా **టెక్స్ టైల్** హబ్‌ను తీర్చిదిద్దేందుకు తెలంగాణ ప్రభుత్వం తీవ్రంగా క్రషి చేస్తోందని, ఇందుకు వరంగల్లో రూపుదిద్దుకుంటున్న కాకతీయ మెగా **టెక్స్ టైల్** పార్కు నిదర్శనమన్నారు. కాకతీయ మెగా టైక్స్‌టైల్ పార్కు ద్వారా వచ్చే ఐదేండ్లలో 9 వేల కోట్ల రూపాయాల పెట్టుబడులు రానున్నాయని చెప్పారు. శంకుస్థాపన నాడే 14 సంస్థలు రూ.3400 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ప్రభుత్వంతో ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు  వెల్లడించారు. నూలు పోగు నుంచీ రెడీమేడ్ వస్త్రాల వరకు అన్నిరకాల వస్త్రాలను తయారుచేసే వస్త్ర పరిశ్రమ పార్కులలో వరంగల్ కాకతీయ మెగా **టెక్స్ టైల్** పార్కు పెద్దదని, ఈ పార్కు కార్యరూపంలోకి వస్తే లక్ష మందికి పైగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని బాలమల్లు తెలిపారు. టీఎస్-ఐఐసీ ఎండీ నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా శంకుస్థాపన చేసిన వరంగల్ కాకతీయ మెగా **టెక్స్ టైల్** పార్కు అభివృద్ధి పనులను వర్షాకాలం ముగియగానే త్వరితగతిన పూర్తిచేసి, వచ్చే ఏడాది ఏప్రిల్-మే నాటికి కార్యరూపంలోకి తేవాలన్నదీ తమ లక్ష్యమన్నారు. అప్రోచ్ రోడ్డు, అంతర్గత

రోడ్డు, రూ.20 కోట్లతో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని, 30 ఎంఎల్‌డీల నీటి కేటాయింపు, 133 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ప్రభుత్వం తగిన నిధులు మంజూరు చేసినందున పనులు త్వరితగతిన పూర్తి చేస్తామని ఎండీ తెలిపారు.

-----------------------------------------------------------------పీఆర్‌వో టూ టీఎస్-ఐఐసీ చైర్మన్